క్లుప్తంగా

మీ వెంటే మేమంతా..



పార్టీ బలోపేతానికి చేపట్టే ప్రక్రియలో మేమంతా మీ వెంటే నడుస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి తెలిపారు. తనయుడు నారాయణమూర్తి రాజుతో కలిసి తాడేపల్లిలో పార్టీ అధినేతను కలిసిన ఆయన స్థానిక అంశాలను వివరించినట్లు తెలియజేశారు. – కోటవురట్ల

సమస్యల పరిష్కారానికి కృషి



గంగాదేవిపేటలో వీధిలైట్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: గంగాదేవిపేటలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర తెలిపారు. గ్రామంలో మరమ్మతులకు గురైన వీధిలైట్లను తొలగించి, కొత్త దీపాల ఏర్పాటుకు గురువారం ఆయన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను దేవీచంద్ర కోరారు.

గంగాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న పరదేశినాయుడు దంపతులు

మునగపాక: మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఆలయ నిర్మాణంలో తాము కూడా భాగస్వామ్యులయ్యామంటూ తమకు తోచిన సాయం చేస్తున్నారు. గురువారం మునగపాకకు చెందిన కాంగ్రేగుల పరదేశినాయుడు, సంధ్య దంపతులు రూ.5,116 నగదును ఆలయ నిర్వాహకులు గాంధీకి విరాళంగా అందజేశారు.

దుర్గాలమ్మ నెల పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో గురువారం దుర్గాలమ్మ తల్లి నెల పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. ఉమ్మలాడ ఎంపీటీసీ మొల్లేటి నారాయణరావు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అచ్యుతాపురం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం, దోసూరు, కొండకర్ల, తిమ్మరాజుపేట గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీను, రాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

- ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- 8న ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు
- నియోజకవర్గంలోని 225 పాఠశాలల్లో నిర్వహణ



పాఠశాలలో నోటిఫికేషన్, ఓటర్ల జాబితా అతికిస్తున్న ఉపాధ్యాయులు



దేవవరం పాఠశాలలో నోటిఫికేషన్ అతికిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలైంది. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు నోటిఫికేషన్ కాపీలను నోటీసు బోర్డులో అతికించారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 1న నోటిఫికేషన్ విడుదలతో పాటు మధ్యాహ్నం ఓటర్ల జాబితా ప్రకటించారు. 5వ తేదీన ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయాలి. మధ్యాహ్నం 3 నుంచి 5గంటల లోపు తుది జాబితా సిద్ధం చేసి ప్రకటించాలి. ఆగస్టు 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రత్యక్ష పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు జరుగుతాయి. తదుపరి ఎన్నికైన సభ్యులు ఎస్ఎంసీ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రమాణ స్వీకారం నిర్వహించాలి. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్యలో కొత్త కమిటీ సమావేశం నిర్వహించాలి.

విద్యాశాఖ ఏర్పాట్లు

నియోజకవర్గంలో దాదాపు 225 పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికైన సభ్యులతో పాటు హెచ్ఎం కన్వీనర్‌గా, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంఈవో నామినేట్ చేసిన ఉపాధ్యాయులు స్థానిక ఎంపీటీసీ, అంగన్‌వాడీ వర్కర్, డ్వాక్రా సంఘ అధ్యక్షులు వ్యవహరిస్తారు. స్థానిక సర్పంచ్ కూడా ఎస్ఎంసీ సమావేశాలకు హాజరై సలహాలు, సూచనలు చేయాలి. ఎన్నికల పరిశీలకులుగా తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్వో లేదా కార్యదర్శులు వ్యవహరిస్తారు.

పాయకరావుపేట మండలంలో 57 పాఠశాలల్లో..

పాయకరావుపేట: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను పాయకరావుపేట మండలంలోని 57 పాఠశాలల్లో ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.ఎస్.గాంధీ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆయా పాఠశాలల్లో అతికించినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలుంటే 5వ తేదీన పరిష్కరించడం జరుగుతుందన్నారు. 8వ తేదీన ఉదయం ఎన్నిక నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లచే ప్రమాణ స్వీకారం చేయిస్తామని వివరించారు.

తల్లిపాలు.. పిల్లలకు మేలు



దిమిలిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



హరిపాలెంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

అచ్యుతాపురం: తల్లి పాల విశిష్టతను గుర్తించి ప్రతి నవజాత శిశువుకు 6వ నెల వచ్చే వరకూ తల్లి పాలనే ఇవ్వాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంత్‌కుమార్ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గురువారం హరిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తల్లి పాలకు బదులు డబ్బా పాలు ఇస్తున్నారని, ఇది పిల్లలకు చాలా నష్టాన్ని కలిగిస్తుందన్నారు. తల్లి పాలలో ఎన్నో పోషక విలువలు కలిగి ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్, ఉమా మహేశ్, వైద్య సిబ్బంది లక్ష్మి, గణేశ్, ఇందిరా, నాగేశ్వరరావు, ముఖేశ్, సంతోషి, మంగ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన పెంచుకోండి

రాంబిల్లి(యలమంచిలి): తల్లిపాలు బిడ్డకు వరమని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని దిమిలి పిహెచ్‌సీ వైద్యాధికారి బాల గంగా శ్రావణి అన్నారు. మండలంలోని దిమిలిలో గురువారం తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు తాగించాలని, ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేసి వ్యాధులు రాకుండా రక్షణగా ఉంటాయని వివరించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం ఎంపిక కాదని, అది నిబద్ధతని పేర్కొన్నారు. తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.వి.రాజు, ఆరోగ్య సిబ్బంది సిహెచ్.ధనరాజు, ఉమామహేశ్వరి, హేమ, ఎల్.హెచ్.పి.కుమారి రేష్మ, వైద్య సిబ్బంది సత్యవాణి, చినమ్మలు, ప్రసాద్, వి.అప్పలరాజు, ఫార్మాసిస్టు కుమారి గాయత్రి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు శ్రీరామరక్ష

కోటవురట్ల: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ కార్యకర్త ఎస్తేరురాణి తెలిపారు. కోటవురట్ల శివారు గొల్లపేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి, ర్యాలీ చేశారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా పెరుగుతారని చెప్పారు. తల్లుల్లో చైతన్యం కలిగించేందుకు ఈ నెల 7వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపేట ఎంపీపీ స్కూల్ హెచ్ఎం జీవన్, ఉపాధ్యాయిని కుమారి, ఏఎన్ఎం రామలక్ష్మి, సీహెచ్‌వో రంజిత, ఆశ వర్కర్ సింహాచలం, రూప, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.



కోటవురట్ల శివారు గొల్లపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



నాగులాపల్లిలో పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్న డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో మన్మధరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో మంజులావాణి సూచించారు. మండలంలోని నాగులాపల్లిలో పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ముందు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి రోగాలు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లపు ఆనందపురం పాఠశాల సందర్శన



విద్యార్థుల పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈవో–2 శివనాయుడు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో–2 శివనాయుడు సందర్శించారు. పాఠశాల విద్యార్థుల హాజరు పుస్తకంతోపాటు పలు సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎంఈవో–2 వెంట హెచ్ఎం కృపావతి, సీఆర్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి సూచించారు. గురువారం మండలంలోని ఉమ్మలాడ యూనిట్ ఆధ్వర్యంలో ఒంపోలులో ఆకుమడులు పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడారు. వరి విత్తనాలు శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లు సోకకుండా చూడవచ్చన్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎరువుల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



అమ్మవారి సన్నిధిలో భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో దుర్గమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో శరగడం జగ్గారావు దంపతులు, పోలవరపు బద్రి, సురేశ్, పోలవరపు జయ, పోలవరపు రామ అప్పారావు, పోలవరపు నాగేశ్వరరావు, కారు కనకరాజు తదితరులున్నారు.

మండలాల్లో పింఛన్ల పంపిణీ



మునగపాకలో పింఛన్ పంపిణీ చేస్తున్న అధికారులు

మునగపాక: మునగపాకలో గురువారం లబ్ధిదారులకు డీఎల్‌డీవో మంజులావాణి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అధికారులు వచ్చి పింఛన్ సొమ్ము మంజూరు చేస్తున్నామన్నారు. పెన్షనర్లకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మధరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

నక్కపల్లి: మండలంలో పింఛన్ల పంపిణీ గురువారం ప్రారంభమైంది. పలు గ్రామాల్లో లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శుల ద్వారా పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోఆర్డీ డి.సత్యనారాయణతో కలిసి పలు గ్రామాల్లో పింఛన్ పంపిణీ పరిశీలించారు.

కోటవురట్ల: మండలంలో పింఛన్ల పంపిణీ గురువారం నిర్వహించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాధరావు పింఛన్ల పంపిణీని ప్రారంభించగా సచివాలయం సిబ్బంది, కార్యదర్శులు పంపిణీ చేశారు. మండలంలో 9,573 పింఛన్లు ఉండగా మొదటి రోజున 9,147 మందికి పింఛన్లు అందజేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు



హాజరైన ప్రధానోపాధ్యాయులు

- డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం: పాఠశాలలో ప్రతీ తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, శిక్షణ ఇవ్వాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ చేస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. అలాగే ఎస్ఎంసీ ఎన్నికలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివాదాలు లేకుండా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏఎస్ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పశులమారమ్మ ఉత్సవం



జాతర పూజలందుకున్న పశులమారమ్మ

ఎస్.రాయవరం: వేమగిరి గ్రామంలో వెలసిన పశులమారమ్మ తల్లి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రైతుల పాలిట కల్పవల్లిగా పేరొందిన ఈ అమ్మవారికి తొలకరి రోజుల్లో ఉత్సవం నిర్వహించి, మొక్కులు చెల్లిస్తారు. ఈ క్రమంలో వేమగిరి, జీవీ పాలెం తదితర గ్రామాల నుంచి రైతులు, పాడి రైతులు, మహిళలు ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

పప్పల చలపతిరావుకు బొడ్డేడ ప్రసాద్ పరామర్శ



పప్పల చలపతిరావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

రాంబిల్లి(యలమంచిలి): ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీ పప్పల చలపతిరావును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం ఆయన స్వగృహం రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఆయనను పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్నారు. స్థానిక పార్టీ నాయకులతో కలిసి బొడ్డేడ ప్రసాద్ పప్పల చలపతిరావుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

బంగారం దుకాణంలో అగ్నిప్రమాదం

అనకాపల్లి : పట్టణంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ పక్కన బంగారు అభరణాల తయారీ దుకాణంలో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మేరకు దుకాణ యాజమాని నక్కా రాజు అందించిన సమాచారంతో మంటలను అదుపు చేసినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి బి.నర్సింగరావు తెలిపారు. దుకాణంలో గ్యాస్ లీకై ప్రమాదం సంభవించినట్లు ఆయన తెలిపారు. సుమారు రూ. లక్షా 50 వేల వరకు నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేశారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమేశ్వరరావు

మాకవరపాలెం: ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పింఛనుదారుల సంఘ రాష్ట్ర అదనపు కార్యదర్శి సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని తామరంలో గురువారం నిర్వహించిన మండల పింఛనుదారుల సంఘ 19వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీతో పాటు ఇతర బకాయిల్ని వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ పింఛనుదారులంతా సమష్టిగా కృషి చేస్తే, డిమాండ్లను సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు జగన్నాథరావు, శర్మ, మండల పింఛనుదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, రంగరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

యలమంచిలి రూరల్: పట్టణంలోని విద్యుత్ లైన్లపై చెట్ల తొలగింపు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం యలమంచిలి టౌన్ ఫీడర్ పరిధిలో తులసీనగర్, మెయిన్‌రోడ్డు, ఎన్‌టీఆర్ కాలనీ, జలాల్ వీధి, ఫైర్ ఆఫీస్ కాలనీ, కాకివాని వీధి ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- యలమంచిలి రూరల్‌లో పురుషోత్తపురం విద్యుత్ ఉపకేంద్రం పీఎస్ఆర్ పేట ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పీఎస్ఆర్ పేట, బయ్యవరం, పులపర్తి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని ఈఈ తెలిపారు.

కోటవురట్ల: కె.వెంకటాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొడవటిపూడి, కె.వెంకటాపురం, తిమ్మాపురం, లింగాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ కార్మికులు

రాంబిల్లి(యలమంచిలి): ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని పంచదార్ల గ్రామ ఉపాధి హామీ కార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని పంచదార్లలో ఉపాధి హామీ కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలిసి గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సుమారుగా 300 నుంచి 400 మంది ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి రెండు వారాల నుంచి గరిష్ఠంగా 10 వారాల వరకు ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండలో చెరువుల్లో మట్టి మోశామని, నేటికీ మా బకాయిలు ప్రభుత్వం ఇవ్వలేదని వాపోయారు. ఇన్ని వారాల పాటు బకాయిలు చెల్లించపోతే ఎలా బతకగలమని ఆందోళన చెందారు. మా పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, ఏడాదికి కుటుంబానికి రెండు వందల రోజులు పనులు కల్పించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని, రోజు కూలీ రూ.600కు పెంచాలని సీఐటీయూ నాయకులు కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధి హామీ పథకం మహిళా కూలీలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు గంపల చినరాజు మాట్లాడుతూ ఈ తీర్పుతో 30 సంవత్సరాల మాదిగల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. ఉద్యమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు తీర్పును అమలు చేయాలని, వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తుమ్మలపల్లి లక్ష్మణరావు, సలికే అచ్చయ్య, కుందూరు రానా, తుమ్మలపల్లి కుమార్, వేమగిరి లక్ష్మణరావు, తుమ్మలపల్లి సతీష్, బొడ్డపాటి సతీష్, గాలింక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌తో ఉపాధి, దేశ సేవ

నర్సీపట్నం: దేశ సేవకు యువత అంకితం కావాలన్న కల ఎయిర్ ఫోర్స్‌లో చేరడం ద్వారా నెరవేరుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాజు పేర్కొన్నారు. సెంట్రల్ ఎయిర్‌మెన్ సెలక్షన్ బోర్డు ఆధ్వర్యంలో అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్వాయు పోస్టుల భర్తీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నివీర్వాయు ఉద్యోగాల కోసం యువతను ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఎయిర్‌ఫోర్స్‌లో స్థిరపడేందుకు యువత ముందుకు రావాలన్నారు. సికింద్రాబాద్ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ నాన్ కమిషన్డ్ అధికారులు ఎస్.సందీప్, దేవకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఎయిర్ ఫోర్స్ కేవలం ఉపాధి కోసం కాదని, దేశ సేవలో దాని పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.